ప్రజాశక్తి

సోమవారం 21 అక్టోబర్ 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

అడ్డగోలుగా ఆనకట్టలు

- వెంచర్లకు దారి కోసం అక్రమంగా నిర్మాణాలు
- రాజకీయ నేతలను వారధులుగా వాడుకుంటున్న రియల్ వ్యాపారులు
- రాజకీయంలో వైరం..వ్యాపారంలో ఐక్యం
- ప్రేక్షక పాత్రలో అధికార యంత్రాంగం



ఆంజనేయస్వామి గుడి సమీపంలో వాగుపై నిర్మిస్తున్న వంతెన

ప్రజాశక్తి-కనిగిరి

'అంతా మా ఇష్టం.. మేం రాజకీయంలో వ్యతిరేకులం గానీ వ్యాపారంలో కాదు.. ఇక్కడంతా జిగిరీ దోస్తులం.. వాగుల్లో, వంకల్లో అక్రమంగా ఆనకట్టలు కట్టేస్తాం.. ఆక్రమణలు చేసేస్తాం.. మమ్మల్ని ఆపేదెవరు? అడ్డుకునేది ఎవరు?' అన్నట్లుగా ఉంది కనిగిరిలో రియల్ వ్యాపారం చేస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీల ద్వితీయశ్రేణి నేతల తీరు. వెంచర్లకు దారి కోసం ఎలాంటి అనుమతులూ లేకుండానే ఆనకట్టలు నిర్మించేస్తున్నారు. వీరిని కట్టడి చేయాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్రలో ఉండిపోతోంది.

కనిగిరిలో రియల్ వ్యాపారం రోజురోజుకూ జోరందుకుంటోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే అవకాశం ఉండటంతో ఈ వ్యాపారంలోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ద్వితీయశ్రేణి రాజకీయ నాయకులు రియల్ వ్యాపారులుగా మారుతున్నారు. రాజకీయంగా మాత్రమే తమకు వైరమని, వ్యాపారంలో మాత్రం ఐక్యం అంటూ ఉమ్మడిగా రియల్ వ్యాపారం చేస్తూ కాసులు కూడ బెట్టుకుంటున్నారు.

పుట్టగొడుగుల్లా రియల్ వెంచర్లు

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకూ రియల్ వెంచర్లు పుట్ట

▶ 2లో

వర్షంతో అపార నష్టం

- 4150.47 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- 3427 మంది రైతులకు నష్టం
- కలెక్టర్‌కు డిఎఒ ప్రాథమిక నివేదికలు



కొండపిలో నీట మునిగిన మిర్చి పంట (ఫైల్)

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలతో రైతులకు నష్టం వాటిల్లింది. జిల్లాలో 4150.47 హెక్టార్లల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. 3,427 మంది రైతులు నష్టపోయారు. వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగి పొర్లాయి. నీరు చేరడంతో పొలాలు చెరువులను తలపించాయి. పంటలు నీట మునిగాయి. 21 మండలాలలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. 3247 మంది రైతులు నష్టపోయినట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాకు జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు ప్రాథమిక నివేదికలు అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పంటల ఎన్యుమరేషన్‌కు వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

4150 హెక్టార్లల్లో దెబ్బతిన్న పంటలు

వాయుగుండం ప్రభావంతో కురిసిన వార్షాలకు జిల్లాలో 4150.47 హెక్టార్లల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. సజ్జ 1883.47 హెక్టార్లు, మినుములు 884 హెక్టార్లు, అలసందలు 1050 హెక్టార్లు, పత్తి 250 హెక్టార్లు, జొన్న 3 హెక్టార్లు, వరి 120 హెక్టార్లల్లో దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

3,427 మంది రైతులకు నష్టం

వర్షాల కారణంగా వివిధ పంటలు దెబ్బతిని 3427 మంది రైతులు నష్టపోయారు. దర్శి సబ్ డివిజన్ పరిధిలోని దొనకొండ మండలంలో

▶ 2లో

కాలనీలోని వర్షపు నీరు మళ్లింపు

దగ్గరుండి జెసీబీతో పనులు చేయించిన పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ఎస్సీ కాలనీలో వర్షపు నీరు పోయే విధంగా ఆదివారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు దగ్గరుండి జెసీబీ యంత్రం ద్వారా కాలువలు తీయించారు. భారీ వర్షాలకు పలు గృహాలు నీటిముంపునకు గురయ్యాయి. వర్షపు నీటితో ఇబ్బంది పడిన కాలనీవాసులు సర్పంచి, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు ఉదయం 10 గంటల నుంచి కార్యదర్శి శ్రీనివాసరావు, పోలీసుల సహకారంతో పనులు చేయించారు. కొందరు కాలువలు తీయటానికి వీలులేదని వాదనకు దిగారు. వారికి పోలీసులు సర్దిచెప్పి పనులు కొనసాగించారు. కొంత దూరం పని చేయాల్సి ఉంది. తొలుత నీటమునిగిన గృహాలను పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.


కాలనీలో వర్షపు నీరు పోయేందుకు జెసిబితో పనులు చేయిస్తున్న అధికారులు

ట్రాక్టర్ ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పొదిలి

ఇటీవల మండలం కాటూరివారిపాలెం గ్రామానికి చెందిన 24 మంది రైతు కూలీలు చీమకుర్తి మండలం కంభంపాడు గ్రామంలో సజ్జ పంట కోతపని ముగించుకుని ట్రాక్టర్లో తిరిగి ప్రయాణమయ్యారు. ఆ సమయంలో ఆగ్రహారం సమీపంలోని ఒంగోలు-నంద్యాల రాష్ట్ర రహదారిపై ట్రాక్టర్ ట్రక్ బోల్తా పడిన సంఘటనలో తీవ్రంగా గాయపడి రెండు కాళ్ల పోగొట్టుకున్న బాధితురాలు మన్నెం పద్మను స్థానిక వీరిశెట్టి కళాశాల యాజమాన్యం ఆదివారం పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ ప్రమాదంలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు కాగా వారిలో కాటూరివారిపాలెం గ్రామానికి చెందిన వీరిశెట్టి జూనియర్ కాలేజీ విద్యార్థిని మన్నం స్ఫూర్తి తల్లి మన్నం పద్మ రెండు కాళ్లూ విరిగిన విషయం తెలుసుకున్న వీరిశెట్టి జూనియర్ కాలేజీ యాజమాన్యం స్పందించి, వారిని, వారి కుటుంబాన్ని పరామర్శించారు. హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మాజీ జడ్‌పిటిసి కాటూరి నారాయణబాబు చేతుల మీదుగా పద్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధితురాలి పిల్లల చదువుల విషయంలో భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీరిశెట్టి జూనియర్ కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు, డైరెక్టర్ కృష్ణంరాజు, ప్రిన్సిపల్ నరసింహారావు, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన బాధితురాలు పద్మను పరామర్శిస్తున్న కాలేజీ యాజమాన్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి పట్టణంలోని పలు ప్రాంతాలలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. పట్నంలోని ఎన్నెస్పీ కాలనీ, అంబేద్కర్ నగర్, ఇసుకవాగు సెంటర్, గరికమెట్ట, మెయిన్ రోడ్, జవహర్ హాస్పిటల్ సెంటర్, బస్టాండ్ సెంటర్ ప్రాంతాలలో విద్యుత్తు మరమ్మతులు జరుగుతున్నందున విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వర్షంతో అపార నష్టం

(మొదటి పేజీ తరువాయి)

సజ్జ పంట 20 హెక్టార్లు, ముండ్లమూరులో సజ్జ పంట 50 హెక్టార్లు, కురిచేడులో పత్తి పంట 250 హెక్టార్లల్లో దెబ్బతింది. తాళ్ళూరు మండలంలో వరి పంట 40 హెక్టార్లు, జొన్న పంట 3 హెక్టార్లు, సజ్జ పంట 132 హెక్టార్లల్లో దెబ్బతింది. కొనకనమిట్ల మండలంలో మినుము పంట 560 హెక్టార్లు, అలసంద పంట 1050 హెక్టార్లల్లో దెబ్బతింది. పొదిలిలో సజ్జ 398 హెక్టార్లల్లో దెబ్బతింది. కనిగిరి సబ్ డివిజన్ పరిధిలోని వెలిగండ్లలో సజ్జ 1075 హెక్టార్లు, కనిగిరిలో సజ్జ 9 హెక్టార్లు, హెచ్‌ఎంపాడులో 52 హెక్టార్లు, సిఎస్‌పురంలో సజ్జ 8 హెక్టార్లు, పామూరులో మినుము పంట 279 హెక్టార్లలో దెబ్బతింది. గిద్దలూరు సబ్ డివిజన్‌లో బేస్తవారిపేట మండలంలో సజ్జ 125 హెక్టార్లల్లో దెబ్బతింది. మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని మార్కాపురంలో సజ్జ 2.47 హెక్టార్లల్లో దెబ్బతింది. యర్రగొండపాలెం సబ్ డివిజన్‌లోని త్రిపురాంతకంలో వరి 40 హెక్టార్లల్లో దెబ్బతింది. ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలోని నాగులుప్పలపాడులో వరి 40 హెక్టార్లు, సజ్జ 2 హెక్టార్లల్లో దెబ్బతింది. చీమకుర్తిలో సజ్జ 10 హెక్టార్లు, సంతనూతలపాడులో మినుము 5 హెక్టార్లల్లో దెబ్బతింది.


కేశిరెడ్డి నగర్‌లో వాగుపై నిర్మించిన వంతెన

అడ్డగోలుగా ఆనకట్టలు

(మొదటి పేజీ తరువాయి)

గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అదిగో రైల్వేస్టేషన్, ఇదిగో ఎక్స్‌ప్రెస్ హైవే, అల్లదిగో ట్రిపుల్ ఐటీ, కనిగిరి కనకపట్నంగా మారిపోతోంది.. స్థలాలు కొనుగోలు చేస్తే లక్షాధికారులు, కోటీశ్వరులు కావచ్చు.. అంటూ ప్రజలకు ఎరవేస్తున్నారు. ఎందుకూ పనికిరాని భూములను వెంచర్లుగా మార్చి ప్రజలకు అంటగడుతూ వ్యాపారం జోరుగా చేసుకుంటూ కోట్లు గడిస్తున్నారు. వాగులను వంకలను సైతం వదలకుండా తమ వ్యాపారానికి అనుగుణంగా మార్చేసుకుంటున్నారు. వాగులలో వంకలలో అడ్డగోలుగా ఆనకట్టలు నిర్మిస్తూ తమ వ్యాపారానికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. అధికార యంత్రాంగం కట్టడి చేయకుండా తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తున్నారు. రియల్ వ్యాపారానికి రాజకీయ నేతలను వారధులుగా వాడుకుంటున్నారు. రాజకీయ నేతలు రియల్ వ్యాపారులకు వారధులుగా ఉండటంతో అధికార యంత్రాంగం కూడా చూసీచూడనట్లు తమకేం కనపడనట్లుగా వ్యవహరిస్తుంది. దీంతో రియల్ వ్యాపారుల అక్రమాలకు అంతులేకుండా పోతోంది. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని పవిత్ర ఫంక్షన్ హాలు వెనుక మరియు కేసిరెడ్డి నగర్, శంఖవరం ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో గల వాగులకు ఆనకట్టలు కట్టేస్తున్నారు. ఒకే వాగులో మూడు ఆనకట్టలు కట్టారు. పాలకులు మారినప్పుడల్లా ఒక వంతెన నిర్మాణం జరుగుతోంది. నీటిపారుదల శాఖ, రెవెన్యూ, మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్.. ఇలా ఏ అధికారులకీ ఈ తతంగం కనిపించడం లేదు. ఇలా వాగులు, వంకల్లో ఆనకట్టలు కట్టడం వల్ల వరదలు వచ్చినప్పుడు వర్షపు నీరు వాగుల గుండా వెళ్లే అవకాశం ఉండదు. దీంతో ఆయా ప్రాంతాల్లో నిర్మించుకున్న నివాసాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంటుంది. ఆస్తి నష్టం, ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉంటుంది. వ్యాపారులు తమ స్వార్థం కోసం వాగులలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా కట్టడి చేసేందుకు అధికార యంత్రాంగం చొరవ చూపడంలేదు.

నిర్మాణానికి అనుమతులు ఇవ్వలేదు

కె.విజయభాస్కర్‌రెడ్డి, డిఇ, ఇరిగేషన్ శాఖ, కనిగిరి



శంఖవరం ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని వాగులో నిర్మిస్తున్న వంతెనకు ఇరిగేషన్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులూ ఇవ్వలేదు. నిర్మాణం విషయం మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో పరిశీలన చేయిస్తాం. నేను ఇటీవలే కనిగిరికి బదిలీపై వచ్చా.. గతంలో నిర్మించిన రెండు వంతెనల గురించి నాకు తెలియదు.

మోగిన అలారం.. ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-కనిగిరి


బ్యాంకు వద్ద గుమిగూడిన ప్రజలు

కనిగిరి పట్టణంలోని ఒంగోలు బస్టాండ్ సెంటర్లో గల స్టేట్ బ్యాంక్ కార్యాలయంలోని అలారం ఆదివారం సాయంత్రం కొంత సమయం ఆగకుండా మోగింది. దీంతో ఆందోళనకు గురైన స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన ఎ శ్రీరామ్ తన సిబ్బందితో కలిసి బ్యాంకు వద్దకు చేరుకున్నారు. బ్యాంక్ అధికారులను పిలిపించి బ్యాంకుని పరిశీలించారు. విద్యుత్ బోర్డులోని బల్లి కారణంగా అలారం మోగిందని గుర్తించడంతో టెన్షన్ తొలగింది. ఏది ఏమైనా బల్లి స్థానిక ప్రజలను, బ్యాంకు అధికారులను, పోలీసులను కొంత సమయం ఆందోళనకు గురయ్యేలా చేసి అప్రమత్తం చేసింది.


నాగరాజుకుంటలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ కామసాని వెంకట సుబ్బారెడ్డి

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని పలు పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిసి రోడ్ల నిర్మాణానికి పలువురు సర్పంచులు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆదివారం మండలంలోని నాగరాజుకుంట, కొనకనమిట్ల, ఇరుసలగుండం, మునగపాడు, మంగాపురం, చింతగుంట్ల, గనివెనపాడు గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నాగరాజుకుంట సర్పంచ్ కామసాని వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పన కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. తొలుత గ్రామంలో అధ్వానంగా ఉన్న రోడ్డును అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో మంచినీటి సమస్య, పారిశుధ్య మెరుగుదలకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తొలుత సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కామసాని వెంకటసుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, పిఆర్ ఏఈ శ్రీనివాసులరెడ్డి, ఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో బులేన్‌రావు, వెలుగు ఏపీఎం సుధాకరరావు పాల్గొన్నారు.

నల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

కారుమంచి కాలువ అభివృద్ధి

ప్రజాశక్తి-చీమకుర్తి

నల్లూరి ఫౌండేషన్ అధినేత, ప్రవాస భారతీయులు నల్లూరి వెంకట శేషయ్య ఆధ్వర్యంలో కారుమంచి కాలువ జంగిల్ క్లియరెన్స్ పనులు, పూడికతీత పనులు విస్తరించారు. కాలువ దిగువ ప్రాంత రైతులు కోరిక మేరకు రైతులకు మేలు చేకూరే విధంగా కాలువ పనులు రెండు పొక్లయిన్లుతో ఆదివారం ప్రారంభించారు. ఈ కాలువ 18 మైళ్లు పారుతుంది. 14వేల ఆయకట్టు ఉంది. కాలువలో 128 క్యూసెక్కుల నీరు పారుతుంది. అయితే గత ప్రభుత్వం సాగర్ కాలువల మరమ్మతులకు కనీసం నిధులు కూడా కేటాయించపోవడంతో కాలువలో పిచ్చి మొక్కలు మొలిచి, నీరు పారని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో రైతుల కోరిక మేరకు ఇటీవల తూము, షట్టర్లు కొత్తవి తయారు చేసి బిగించారు. దాదాపు రూ.15 లక్షల పనులు పూర్తి చేశారు. అయితే కారుమంచి కాలువ దిగువ రైతులు నల్లూరి వెంకట శేషయ్యను తమ గ్రామాల పరిధిలో కూడా పనులు చేపట్టాలనీ కోరారు. స్పందించిన నల్లూరి వెంకట శేషయ్య పూడికతీత పనులు రెండు పొక్లయిన్లుతో ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు కాట్రగడ్డ రమణయ్య, కందిమళ్ల గంగాధరరావు, లక్ష్మీనారాయణ, పౌండేషన్ ప్రతినిధులు పాలడుగు వెంకట నారాయణ, పుట్టా శ్రీను, గోరంట్ల ప్రసాదు, మాజీ కౌన్సిలర్ ఎస్‌కె అహమ్మద్ బాబు, ముస్లీం యూత్ నాయకులు ఎస్‌కె రఫీ, ఎస్ అప్‌సాలేహా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లూరి వెంకట శేషయ్యను ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ అభినందించారు. రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.



రెండు ప్రొక్లయిన్లతో పనులు చేపట్టిన నల్లూరి ఫౌండేషన్ ప్రతినిధులు



టపాసులను సీజ్ చేసిన ఎస్ఐ శ్రీరామ్

అనుమతులు లేని టపాసులు స్వాధీనం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలో బొడ్డుచావిడి వద్ద గల రామాలయం వీధిలో వలరాం మార్వాడి రాజస్థాన్‌కు చెందిన ఫ్యాన్సీ షాపును కనిగిరి ఎస్ఐ టి శ్రీరామ్ పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం తనిఖీ చేశారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి పర్మిషన్లు తీసుకోకుండా అక్రమంగా దీపావళి టపాసులను నిలువచేసి విక్రయిస్తున్న సుమారు 75 వేల విలువచేసే క్రాకర్స్, టపాసులను సీజ్ వేశారు. దుకాణదారునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణంలో ఎవరైనా ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా అక్రమంగా దీపావళి టపాసులను నిల్వ ఉంచినా, విక్రయించినా అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణదారులకు కనిగిరి ఎస్ఐ తెలిపారు.

యర్రగొండపాలెం: మండల కేంద్రమైన పెద్దదోర్నాలలోని నటరాజ్ సెంటర్ సమీపంలోని ఓ ఫ్యాన్సీ దుకాణాంలో అక్రమంగా దాచిన బాణా సంచాలను పెద్ద దోర్నాల ఎస్సై వి.మహేష్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకండా దీపావళి సామాన్లు, బాణసంచాలు, చిచ్చుబుడ్లు, తదితర సామాగ్రి దీపావళి వస్తువులు, ఇండ్లలోగానీ, గోడౌన్‌లోగా ఉంచుకున్నట్లుయితే వారిపైన కఠిన చర్యలు తీసుకంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలను పాటిస్తూ, అనుమతులు తీసుకోవాలని తెలిపారు.

చోరీల్లో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని భగత్‌సింగ్ నగర్ కాలనీ, ఇండో ఫ్యాక్టరీ వెనుక పగటిపూట చోరీలు జరిగాయి. ఇళ్లలో చొరబడి దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. చోరీల్లో నిందితుడుగా గుర్తించిన కొండేటి ఇంద్ర పవన్ కుమార్‌ను పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబు ఆదివారం అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టుకు హాజరుపరచగా కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. నిందితుడు కొండేటి ఇంద్ర పవన్‌కుమార్‌ది శ్రీశైలం మండలంలోని సున్నిపెంట స్వగ్రామం. ప్రస్తుతం మార్కాపురంలోని వడ్డే బజారులో నివాసం ఉంటున్నాడు. ఆదివారం మార్కాపురం శివారులోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద అరెస్ట్ చేశారు. దొంగిలించిన సొత్తులో కంప్యూ టర్ మానిటర్, ఎల్ఇడి టివి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కొండ చిలువ కలకలం

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం జేపీ చెరువు గ్రామ సమీపం పొలాల్లో ఆదివారం కొండచిలువ కలకలం రేపింది. కొండ చిలువను గుర్తించిన స్థానిక రైతులు ఆందోళనతో వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ రెస్క్యూ టీం అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని కొండచిలువలు పట్టుకొని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో ఆ చుట్టు పక్కల రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



కొండచిలువను బంధిస్తున్న దృశ్యం

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాల పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లను ఆదివారం పోలీస్ స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రభాకర్ రావు మాట్లాడుతూ రౌడీ షీటర్లు ఎవరైనా గొడవల్లో కానీ, దందాలలో కానీ పాల్గొంటే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గొడవలు జరుగుతుంటే అక్కడి నుండి దూరంగా వెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో దోర్నాల ఎస్ఐ మహేష్, రైటర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మోసపోయిన బాలికకు న్యాయం చేయాలి

దళిత నేత నీలం నాగేంద్రరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నకిలీ పోలీస్ చేతిలో అత్యాచారానికి గురైన దళిత బాలికతో లిట్మస్ టెస్ట్ పేరుతో మళ్లీ మళ్లీ ఫిర్యాదు రాయించి ఒంగోలు రూరల్ సిఐ శ్రీకాంత్ బాధితురాలని వేధిస్తున్నారని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలులోని తన కార్యాలయంలో నాగేంద్రరావు ఆదివారం మాట్లాడారు. 2023 ఏప్రిల్‌లో నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని దళిత బాలిక స్కూటీపై ఇంటికి వెళుతుండగా పోలీసు దుస్తులతో దారికాచిన షేక్ రసూల్‌బాషా అత్యాచారం చేసాడన్నారు. దుస్తులు లేని ఫోటోలను యూట్యూబ్‌లో పెడతానని బెదిరించి అనేక మార్లు అత్యాచారం చేసి, ఆ బాలిక గర్భం దాల్చేలా చేసాడన్నారు. ఈ కేసులో కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే నాగులుప్పలపాడు వచ్చారని కేసు నమోదు చేయకుండా ఆపేశారని ఆరోపించారు. నిందితుడు రసూల్ బాషాను అరెస్టు చేయాలని నాగేంద్ర డిమాండ్ చేశారు.



నివాళులర్పిస్తున్న సిఐ ప్రభాకరరావు

మృతి చెందిన కానిస్టేబుల్‌కు నివాళి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందిన కానిస్టేబుల్ దూదేకుల సుభానికి సిఐ ప్రభాకరరావు, ఎస్ఐ మహేంద్రలు నివాళులర్పించారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి అతని స్వగ్రామమైన పెద్దదోర్నాల మండలంలో చినుగుడిపాడు గ్రామానికి తీసుకొచ్చారు. పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతి చెందిన సుభానికి ఒక పాప ఉంది. ప్రస్తుతం అతని భార్య రసూల్‌బి గర్భిణి. మరణవార్త తెలుసుకొని దూదేకల సుభాని తండ్రి వలికి బీపీ అధికమై అపస్మారక స్థితికి చేరడంతో అతనిని వైద్యశాలలో చేర్పించారు.

డిఆర్‌యుసిసి మెంబర్‌గా ఆర్‌కెజె

ప్రజాశక్తి-మార్కాపురం

గుంటూరు డివిజనల్ రైల్వే యూజర్స్ కమిటీ (డిఆర్‌యుసిసి) సభ్యులుగా మార్కాపురం పట్టణానికి చెందిన ఆర్‌కెజె నరసింహం నియమితులయ్యారు. ఈ మేరకు డివిజనల్ రైల్వే మేనేజర్ రామకృష్ణ ద్వారా ఉత్తర్వులు అందాయి. మార్కాపూర్ రోడ్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



నరసింహం

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని డీజీపేట గ్రామం సమీపంలోని పొలంలో ఆదివారం చోటు చేసుకుంది. డీజీ పేట గ్రామానికి చెందిన డేగా రత్నమ్మ (58) గేదెలకు గడ్డి కోసుకు వచ్చేందుకు పొలం వెళ్ళింది. గడ్డి కోసం వెళ్ళిన రత్నమ్మ సాయంత్రం అయినా కూడా ఇంటికి రాకపోవడంతో బంధువులు వెతుకుతూ పొలానికి వెళ్లారు. పొలంలో మృతి చెంది పడి ఉండటాన్ని గుర్తించారు. తలపై దెబ్బ తగిలి ఉండటాన్ని గమనించిన బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై ఆర్.సుమన్ సిబ్బందితో ఆదివారం రాత్రి సంఘటనా స్థలానికి వెళ్లి బంధువులు, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. మృతురాలి ఒంటిపై ఉండవలసిన బంగారు వస్తువులు లేవని, బంగారం కోసం ఎవరైనా హత్య చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

విశ్రాంత ఉపాధ్యాయుడు పగిడి అల్లూరు రెడ్డి మృతి

ప్రజాశక్తి- రాచర్ల

రాచర్ల మండలం జెపి చెరువు గ్రామ పరిధిలోని నెమలి గుండ్ల రంగ నాయక స్వామి దేవస్థానం, కాశిరెడ్డి నాయన రెడ్ల అన్నదాన సత్రం వ్యవస్థాపక అధ్యక్షులు, విశ్రాంత ఉపాధ్యాయులు పగిడి అల్లూరు రెడ్డి (72) శనివారం కన్నుమూశారు. అల్లూరు రెడ్డి మండలములోని చొలవీడు, చిన గానిపల్లె, జెపి చెరువు గ్రామాల్లో ఉపాధ్యాయులుగా పని చేసి రిటైర్ అయ్యారు. నెమలి గుండ్ల రంగ నాయక స్వామి దేవస్థానం వద్ద ఎన్నో వ్యయ ప్రయాసలనెదుర్కొని కాశీరెడ్డి నాయన రెడ్ల అన్నదాన సత్రం ఏర్పాటు చేసి భక్తులకు అన్ని మౌలిక వసతులతో భవనాన్ని నిర్మించారు. సమాజ సేవకే ప్రాధాన్యత ఇచ్చేవారని ఈయన మరణం పట్ల మండల ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత పాతిక సంవత్సరాలుగా ప్రతి శనివారం స్వామిని దర్శించడానికి వచ్చే భక్తులకు, కుల మతాలకతీతంగా ఈ అన్న సత్రం ద్వారా నాణ్యమైన భోజనము అందించారు. వీరి అకాల మరణము అనేక మంది భక్తులను, ప్రజలను శోక సముద్రంలో ముంచేసింది.



అల్లూరు రెడ్డి (ఫైల్)

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం అంకాలమ్మపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఆదివారం గ్రామానికి చెందిన రాచగొర్ల నాగార్జున (26) అనే యువకుడు తన పొలంలో వరి పంటకు నీళ్ల వదిలేందుకు బోరుబావి వద్దకు వెళ్లి మోటర్ స్విచ్ వేస్తుండగా విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. జరిగిన సంఘటనను గుర్తించిన చుట్టు ప్రక్కల రైతులు నాగార్జున కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నాగార్జున భౌతికకాయాన్ని చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన నాగార్జున

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-మద్దిపాడు

సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులప్పలపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలోని తాత్కాలిక, పర్మినెంట్ ఫైర్ క్రాకర్స్ విక్రయదారులతో ఒంగోలు రూరల్ సిఐ ఎన్. శ్రీకాంత్ బాబు తన కార్యాలయంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. తాత్కాలిక దీపావళి టపాసులు అమ్మేవారికి తీసుకొనవలసిన జాగ్రతలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలిక టపాసులు అమ్మేవారు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని, ప్రభుత్వం తెలియచేసిన ప్రాంతంలోనే అమ్మాలని తెలిపారు. అధికారులు సూచించిన ప్రదేశంలోనే తగు నిబంధనలు పాటించి విక్రయాలు జరపాలని, అలా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరైనా విక్రయాలు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాణసంచా విక్రయ ప్రదేశాలలో చిన్నపిల్లలు లేకుండా చూసుకోవాలని, వాటర్ డ్రమ్, బకెట్లు కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎవరైనా పర్మిషన్ తీసుకోకపోతే ఈనెల 22వ తేదీ వరకు గడువు పొడిగించినందున తప్పనిసరిగా పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పర్మిషన్ రోజులు అయిపోయిన పిదప వారి దగ్గర ఉన్నటువంటి దీపావళి టపాసులను తప్పనిసరిగా పర్మిషన్ ఉన్న స్టోర్‌లోనే పెట్టాలన్నారు. ఈ సమావేశంలో మద్దిపాడు ఎస్ఐ బి.శివరామయ్య, సంతనూతలపాడు ఎస్ఐ వి.అజయ్ బాబు, పోలీసు స్టేషన్స్ సిబ్బంది, మూడు మండలాల తాత్కాలిక లైసెన్స్‌దారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ శ్రీకాంత్ బాబు



రైతును సత్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

మార్టూరు రైతుకు రైతునేస్తం పురస్కారం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రకృతి వ్యవసాయంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న మార్టూరు రైతుకు అరుదైన పురస్కారం లభించింది. వ్యవసాయ రంగానికి జీవితాంతం సేవలందించిన వ్యవసాయ శాస్త్రవేత్త 'పద్మశ్రీ' డాక్టర్ ఐవి సుబ్బారావు పేరిట అందిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల 'రైతునేస్తం – 2024 పురస్కారానికి మండలంలోని బొబ్బేపల్లికి చెందిన రైతు పెంటేల శరత్ బాబు ఎంపికయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో విశేష ప్రతిభ కనపరచిన రైతులకు ప్రతిఏటా 'శ్రీ ముప్పవరపు ఫౌండేషన్', 'రైతునేస్తం' సంయుక్తంగా 20మంది రైతులను ఎంపిక చేసి కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆవరణలో భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు చేతుల మీదుగా అందజేశారు. 'రైతునేస్తం పురస్కారాలు' అందజేసి రైతులను ఘనంగా సత్కరించారు. మార్టూరు ప్రాంత ప్రకృతి వ్యవసాయ రైతుకు ఈ అవార్డు దక్కడం పట్ల ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేశారు.



సుశీలను సత్కరిస్తున్న పట్టబద్రుల సంఘం ప్రతినిధులు

మహిళా సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి - వేటపాలెం

శాంతి నికేతనం మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి సుశీలను మహిళా ఉద్యోగుల వేధింపు నివారణ కమిటీలో సభ్యులుగా నియమించిన సందర్భంగా పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ఆమెను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ వేటపాలెం, చిన్నగంజాం, చీరాల ప్రాంతాల్లో మహిళల సాధికారతకు ఆమె అనేక సంవత్సరాలుగా సేవ చేస్తున్నారని అన్నారు. ఆమె సేవలకు గుర్తింపుగా మహిళా ఉద్యోగుల వేధింపుల నివారణ కమిటీలో నియమించడం ఆనందంగా ఉందని అభినందించారు. కార్యక్రమంలో పట్టబద్రుల సంఘ ప్రధాన కార్యదర్శి సుంకర వెంకటలక్ష్మీ ప్రసాద్, డివిఆర్ నాగరాజు, ప్రత్తి శరత్ బాబు, బొడ్డు శ్రీనివాసరావు, గద్దె రాఘవ, రావి మస్తానరెడ్డి, సురేఖ, శ్రీహరి, కోటేశ్వర రావు పాల్గొన్నారు.



అల్పాహారం వడ్డిస్తున్న రోటరీ ప్రతినిధులు

వృద్ధాశ్రమంలో అల్పాహార వితరణ

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక నేతాజీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, అల్పాహారం క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ దంపతులు ఆదివారం అందజేశారు. వృద్ధులు అందరు కలసి మేలసి మంచి ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, నాగుబైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, కోట శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, చంద్రశేఖరరావు, కె సుబ్రహ్మణ్యచారి పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు



శంకుస్థాపనలో అనగాని శివప్రసాద్



శంకుస్థాపనలో జనసేన బాపట్ల ఇన్‌ఛార్జి నామన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ శంకుస్థాపనలు శనివారంతో ముగిశాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలానికి రు.2.70 కోట్ల నిధులు మంజూరైనట్లు శాసన సభ్యులు నక్క ఆనందబాబు తెలిపారు. వీటి ద్వారా 4048 మీటర్ల సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. 15 పంచాయతీల్లో 12 రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. మండలానికి 25 గోకులం షెడ్లు నిర్మాణానికి రూ.51.35లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. వీటి నిర్మాణానికి పనులు ప్రారంభించినట్లు ఎపిఒ శివపార్వతి తెలిపారు. ఆళ్ళమూడి గ్రామానికి రూ.15లక్షలు, భట్టిప్రోలులో మూడు పనులకు రూ.60లక్షలు, చింతమోటులో రూ.20 లక్షలు, ఐలవరంకు రూ.50లక్షలు, ఓలేరుకు రూ.25లక్షలు, పల్లికోనకు రూ.15లక్షలు, పెదపులివరుకు రూ.20లక్షలు, రాచూరుకు రూ.15లక్షలు, సూరేపల్లికి రూ.20లక్షలు, వెల్లటూరుకు రూ.30 లక్షల నిధులు సిసి రోడ్ల నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. ఆళ్ళమూడిలో గోకులం షెడ్డుకు రూ.2.30 లక్షలు, భట్టిప్రోలులో ఆరు షెడ్లకు రూ.13.80లక్షలు, గొరిగపూడిలో రూ.2.30లక్షలు, ఐలవరంలో మూడు షెడ్ల నిర్మాణానికి రూ.5.75లక్షలు, ఓలేరులో మూడు షెడ్ల నిర్మాణానికి రూ.5.30లక్షలు, పల్లెకోన గ్రామానికి రూ.1.85లక్షలు, పెదలంకలో రెండు షెడ్ల నిర్మాణానికి రూ.4.60లక్షలు, పెదపులివరులో నాలుగు షెడ్ల నిర్మాణానికి రూ.6.70 లక్షలు, రాచూరులో రెండు షెడ్ల నిర్మాణానికి రూ.4.15లక్షలు, సూరేపల్లిలో ఒక షెడ్డుకు రూ.2.30లక్షలు, వెల్లటూరులో రూ.2.30 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు.

పంగులూరు : మండల కేంద్రమైన పంగులూరులో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.35లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె స్వరూప రాణి మాట్లాడుతూ గ్రామంలో రూ.35లక్షలతో సిమెంట్ రోడ్లు, మినీ గోకులం షెడ్ నిర్మించేందుకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. నాణ్యత, మన్నికగా పనులు చేయాలని సూచించారు. గ్రామంలో ఇంకా అనేక పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. మండలంలో 33 పనులకు రూ.3.30కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ పనులన్నీ సకాలంలో పూర్తి చేసేందుకు నాయకులు, అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డి సుమంత్, మాజీ జెడ్పిటిసి బాచిన చెంచు ప్రసాద్, సర్పంచి గుడిపూడి నాగేంద్రమ్మ, పంచాయతీరాజ్ ఎఇ హనుమంతరావు, ఎపిఒ సంతోషమ్మ, పంచాయతీ కార్యదర్శి బి రాంబాబు, తెలుగుదేశం మండల అధ్యక్షుడు రావూరి రమేష్ బాబు, గ్రామ అధ్యక్షుడు బాచిన త్రివేణి బాబు, నాయకులు జాగర్లమూడి సుబ్బారావు, చౌదరి బాబు, గుడిపూడి రామారావు, చిలుకూరి నాగేశ్వరరావు, మేడ సుబ్బారావు, ఈసీ మురళి పాల్గొన్నారు.

రేపల్లె : పల్లెల అభివృద్ధే లక్ష్యంగా 'పల్లె పండుగ' నిర్వహిస్తున్నట్టు టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని మృత్యుంజయపాలెంలో భివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించి పనిచేస్తున్నట్లు చెప్పారు. పల్లె పండుగతో గ్రామాలు, పల్లెల్లో నూతన వెలుగులు వస్తాయని అన్నారు. ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకుందని ఎంపిడిఒ ఎం శోభారాణి అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుర్రం మురహరిరావు, గోగినేని శ్రీనివాసరావు, పిఆర్ ఎఈ చక్రవర్తి పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని కారంచేడు, కుంకలమర్రు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. కారంచేడులో రు.1.10కోట్లతో సిసి రోడ్లకు, కుంకలమర్రులో రూ.35లక్షలతో సిమెంట్ రోడ్ల పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ నేతాజీ మాట్లాడుతూ పల్లె పండగ వారోత్సవల్లో మండలంలోని అన్ని పంచాయతీల్లో రూ.3.67కోట్లతో సిమెంటు రోడ్లు, 20 గోకులం షెడ్లకు రూ.40.30లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఇ దాసు, ఎపిఒ బుల్లియ్య, తెలుగుదేశం మండల అధ్యక్షులు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి కాశీం, సురేంద్ర బాబు, ఎంపిటిసి యార్లగడ్డ అక్కయ్య చౌదరి, సర్పంచ్ బాలిగ శివ పార్వతి, కుంకలమర్రు తెలుగుదేశం నాయకులు ఐ బంగారు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల : గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు మెరుగైనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివన్నారాయణ అన్నారు. మండలంలోని జిల్లెళ్ళమూడిలో సిసి రోడ్డు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎన్ సుబ్బరాజు, కెఆర్‌కె నాయుడు, టిడిపి నాయకులు గండికోట పోతురాజు, గండికోట సుబ్బయ్య, షేక్ ఎనీషా పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలో రావికంపాడు, తాడిగిరిపాడు, బొద్దులూరుపాడు గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులతో సిసి రోడ్లు, కాలువల నిర్మాణానికి తెలుగుదేశం మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, జనసేన మండల అధ్యక్షులు బొందలపాటి చలమయ్య ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మైనేని మురళీకృష్ణ మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం శ్రద్ధ చూపుతుందని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, శాసన సభ్యులు నక్క ఆనందబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి, ఈఒ మల్లికార్జున, సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



పంగులూరులో శంకుస్థాపన చేస్తున్న అధికారులు



కారంచేడులో శంకుస్థాపన చేస్తున్న ఎంపిడిఒ నేతాజీ



శంకుస్థాపనలో కొల్లూరు నాయకుడు మురళీకృష్ణ

రీ సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు



ఎం శ్రీనివాసరావు

గత ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు కలెక్టర్ ఆదేశాల ప్రకారం మండలంలోని గొరిగపూడి, కోనేటిపురం, పల్లికోన గ్రామాల్లో భూముల రీ సర్వే నిర్వహించినట్లు తహశీల్దారు మేక శ్రీనివాసరావు తెలిపారు. రీ సెర్వే జరిగిన గ్రామాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు గోరిగపూడిలో 24న, కోనేటిపురంలో 29న, పల్లెకోనలో నవంబర్ 02న రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. భూమి సమస్యలపై రైతులు గ్రామ సభల్లో అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.


వేమూరు : భూముల రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఈనెల 23 నుండి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు సుశీల తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో పులిచింతల పాలెం, పోతుమర్రు, బలిజేపల్లి గ్రామాల్లో భూముల రీ సర్వే చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఈనెల 22న పులిచింతలపాలెంలో, 23న పోతుమర్రులో, 24న బలిజెపల్లిలో రెవిన్యూ గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు. ఆయా సభల్లో భూమికి సంబంధించిన సమస్యలు ఉన్న రైతులు గ్రామ సభలకు హాజరై అధికారులకు సమస్యలు వివరించి పరిష్కరించుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ఉంటారని తెలిపారు.



తహశీల్దారు సుశీల

పోలీసుస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ముండ్లమూరు



రికార్డులు పరిశీలిస్తున్న దర్శి డిఎస్‌పి లక్ష్మినారాయణ

ప్రకాశం జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ సూచనల మేరకు దర్శి డిఎస్‌పి లక్ష్మీనారాయణ స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆదివారం తనిఖీ చేశారు. రికార్డులు, కేసు డైరీలు, రిజిష్టర్లను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. స్టేషన్లో పెండ్డింగ్ కేసులన్ని పరిష్కరించాలని సూచించారు .బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని చెప్పారు. నిష్పక్షపాతంగా విచారణ చేసి న్యాయం జరిగే విధంగా చూడాలని అన్నారు. గంజాయి, పేకాట, గుట్కాపై నిఘ పెట్టాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా రాత్రిపూట గస్తీ నిర్వహించాలని అన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

ప్రజాశక్తి
సోమవారం 21 అక్టోబర్ 2024

వీడని వర్షం..

- ఆరని భూములు
- ఆందోళనలో రైతులు
- మొదటి పంట వర్షార్పణం
- రెండో పంటకు అనుమానమే

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అల్పపీడన ప్రభావంతో మొన్నటి వరకూ భారీ వర్షాలు కురిశాయి. ఇప్పుడు మళ్లీ కురుస్తున్నాయి. వరుస వర్షాలతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి పంటల సాగుకు అవసరమైన మేర వర్షాలు పడలేదు. కొమ్మమూరు కాలువకూ నీరు సక్రమంగా విడుదల కాలేదు. వరినార్లు పోసేందుకు నీరు లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. వర్షాలు కూడా సక్రమంగా లేకపోవడంతో వెదపద్దతిలో వరిసాగు చేశారు. వరి మెలకలు వచ్చిన దశలో జూన్‌లో వర్షం పడింది. సాధారణ వర్షపాతం 71.0 మిల్లీమీటర్లు కాగా 117.6 మి.మీ వర్షపాతం నమోదయింది. దీంతో వరిసాగు చేసిన రైతులు నష్టపోయారు. నారు కొని మళ్లి వరినాట్లు వేశారు. జూలైలో సాధారణ వర్షపాతం 118.5 మి.మీ కాగా 143.4 మి.మీ నమోదయింది. ఆగస్టులో సాధారణ వర్షపాతం కంటే తక్కువగానే వర్షం పడింది. సెప్టెంబరు నెలలో సాధారణ వర్షపాతం 157.8 మి.మీ కాగా 175.1 మి.మీ వర్షపాతం నమోదయింది. దీంతో కృష్ణానది పరివాహక ప్రాంతంలోని లంకభూములు ముంపునకు గురయ్యాయి. వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజవర్గాల్లో వరి,కంద, పసుపు,అరటి, తమలపాకుల తోటలు వందలాది ఎకరాలు నీట మునిగాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొమ్మమూరు కాలువ కట్టకు గండ్లు పడాౖడ. నీరు దిగువకు రాక చీరాల, పర్చూరు ప్రాంతంలో వరి సాగు చేసిన రైతులు నీరందక రైతులు ఇక్కట్లు పడ్డారు.ఆయిల్ ఇంజిన్ల ద్వారా పంటలను నీరు పెట్టుకున్నారు. దీంతో రైతులపై ఆర్ధిక భారం పడిది. సెప్టెంబరులో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు నీట మునిగిన పంట నేటికి వరద నీటిలోనే ఉంది. మొదటి పంటను కోల్పోయిన రైతులు రెండో పంటగా మినుము లేదా మొక్కజొన్న సాగు చేస్తారు. వర్షపు నీరు బయటకు వెళ్ళే మార్గం లేకపోవడంతో రెండో పంట సాగు సాధ్యం కాలేదు. ఈనెలలో అల్పపీడనం కారణంగా వరుసగా వర్షాలు పడుతున్నాయి. దీంతో జిల్లాలో సుమారు 25 వేల ఎకరాల్లో సాగు చేసిన మినుము,మిరప,పత్తి,కంది, లోతట్టు ప్రాంతంలో సాగు చేసిన వరి పైరు కూడా దెబ్బతినే పరిస్థితి నెలకొంది. వరద ప్రభావం నుంచి రైతులు ఇంకా కోలుకోక ముందే అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



బాపట్ల జిల్లా చెరుకుపల్లి ప్రాంతంలో భూముల్లో ఉన్న నీరు

జిల్లా రైతులు ప్రతి ఏటా తుపానులు, వరదల కారణంగా పొలాలు నీట మునిగి తీవ్రంగా నష్టపోతున్నారు. వరదనీటిని వేగంగా దిగువకు తీసుకువెళ్ళి సముద్రంలో కలిపే మురుగుకాలువలు ఏళ్లతరబడి మరమ్మతులకు నోచలేదు. ఫలితంగా పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి.లంక గ్రామాలల్లో ఈ సమస్య అధికంగా ఉంది. భారీ వర్షాలలు, వరదల సమయంలో జిల్లా లోని ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదనీరు జిల్లా పరిధిలోని నల్లమడ, రొంపేరు, వేటపాలెం, ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్‌లు,పేర్లి, తుంగభద్ర,కొల్లిమర్ల పెద్దడ్రయిన్లతో పాటు చిన్నపాటి డ్రయిన్ల ద్వారా సముద్రంలో కలవాల్సి ఉంది.గత నాలుగేళ్లుగా ఈడ్రయిన్లకు మరమ్మతులు చేపట్టలేదు. మురుగు నీటి కాలువలు, వాగుల్లో గుర్రపుడెక్క, జమ్ము పేరుకు పోయి ఉంది. పూడిక తీసిన పరిస్థితి లేదు. దీంతో వరదనీరు సాఫీగా దిగువకు వచ్చే పరిస్థితి లేదు. భారీ వర్షాలు కురిస్తే వాగులు,మురుగునీటి కాలువలు పొంగి పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మురుగు కాలువలు, పంట కాలువలకు మరమ్మతులు చేయించి రైతులను ఆదుకోవాల్సి ఉంది.

సాగు భారం.. వ్యవసాయానికి దూరం..

- వ్యవసాయం రంగంపై జిఎస్‌టి వడ్డన
- ఏటా రూ.100 కోట్ల మేర భారం
- పెరుగుతున్న పెట్టుబడి ఖర్చు



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వ్యవసాయం పెను భారంగా మారుతోంది. దీంతో వ్యవసాయరంగాన్ని నమ్ముకున్న రైతులు నేడు సాగుకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. రోజురోజుకూ పెరుగుతున్న పన్నుల భారంతో పంటలు సాగు చేయాలంటేనే అన్నదాతలు భయపడే స్థితికి చేరుకున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో సుమారు 10 లక్షల ఎకరాలకు పైగా జిల్లాలో పంటలు సాగవుతున్నాయి. ఉద్యాన, వాణిజ్య పంటలు మరో లక్ష ఎకరాల్లో సాగు అవుతున్నట్లు అంచనా. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో 50 శాతానికి పైగా ఉపాధి పొందుతున్నారు. ఇలాంటి ప్రధాన రంగంపై కేంద్ర ప్రభుత్వం పన్నుల పేరుతో గోళ్లూడపీకుతోంది. జిఎస్‌టి పేర ప్రతి ఏటా రూ.100 కోట్ల మేర అన్నదాతలపై భారం పడుతోంది. వరి సాగుకు పెట్టుబడి ఖర్చులు ఏటికేడు పెరిగిపోతుండగా అందుకు అనుగుణంగా దిగుబడుల ధరలు లభించని దుస్థితి నెలకొంది. దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆత్మస్థైయిర్యం కోల్పోయి కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మరికొందరు సాగుకు దూరమవుతున్నారు.

ఎనిమిదేళ్లుగా జిఎస్‌టి బాదుడు..

కేంద్ర ప్రభుత్వం 2017 నుంచి జిఎస్‌టిని అమల్లోకి తెచ్చింది. అప్పటి నుంచి క్రిమిసంహారక మందులపై 18 శాతం, యంత్ర పరికరాలపై 12 నుంచి 18 శాతం జిఎస్‌టి వసూలు చేస్తున్నారు. ఎరువులపై పన్నును 5 శాతానికి పరిమితం చేసి, విత్తనాలకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. పురుగు ముందుల లావాదేవీలు సీజన్‌కు రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల మేర లావాదేవి జరుగుతుంటాయి. వ్యవసాయ ఉపకరణాలను ఏడాదికి రూ.110 కోట్ల మేర కొనుగోలు చేస్తుంటారు. వీటిపై కేంద్రం అధిక శాతం జిఎస్‌టి విధించడంతో జిల్లాలోని రైతులపై ఏడాదికి రూ. 50 కోట్లు మేర భారం పడుతోంది.

పురుగు మందులపై 18 శాతం భారం

రెండు దశాబ్ధాల క్రితం రుతువులు కాలానుగుణంగా నడిచేవి. దానికి తగ్గట్టుగానే పంటలకు చీడ పేదల బెడద తక్కువగా ఉండేది. కాలగమనంలో రుతువులు కూడా గతి తప్పడం ప్రారంభమైంది. రకరకాల కొత్త తెగుళ్లు, చీడపీడలు పంటలకు ఆశించడం అధికమైంది. వాటి నివారణకు అనివార్యంగా రైతులు క్రిమి సంహారక మందులను పిచికారీ చేయడం మొదలు పెట్టారు. దీంతో పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. దిగుబడుల్లో నాణ్యత లోపిస్తోంది. ఈ క్రమంలో గోరు చుట్టుపై రోకటి పోటు అన్న చందంగా జిఎస్‌టి రైతులను మరింత బాధిస్తోంది. గతంలో పురుగు మందులపై పన్ను నామమాత్రంగా ఉండేది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండటంతో పరిస్థితిని బట్టి పన్ను విధించేవారు. దీంతో ధరలు తక్కువగానే ఉండేవి. కేంద్ర ప్రభుత్వం పురుగు మందులను కూడా జిఎస్‌టి పరిధిలోకి తెచ్చింది. ఫలితంగా ఏటా 10 శాతం ధరలు అదనంగా పెరుగుతూ ఉన్నాయి.

పెట్టుబడి ఖర్చులు పెరగడంతో..

ఏటా పెట్టుబడి ఖర్చులు పెరగడంతో, మరో వైపు ప్రకతి వైపరీత్యాలు, ఇంకో వైపు దిగుబడులు సరిగా రాకపోవటం వంటి కారణాలతో కర్షకులు నష్టాల పాలవుతున్నారు. దీంతో ఎక్కువ శాతం మంది సాగుకు దూరమయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రత్యామ్నాయం లేకపోవటంతో కష్టమైనా, నష్టమైనా సాగు చేసుకుంటూ కొందరు జీవనం సాగిస్తున్నారు.

పంటలు వేయాలంటేనే భయమేస్తోంది

పాశం వెంకటేశ్వర్లు, రైతు, కుందంపల్లి



పంటలు వేయాలంటే భయమేస్తోంది. నిన్న ఉన్న రేటు ఈరోజు ఉండడం లేదు. వ్యవసాయ రంగానికి సంబంధించిన అన్ని ధరలు పెంచేస్తున్నారు. పదేళ్ల క్రితం ఎకరాకు రూ. 15 వేల పెట్టుబడి పెడితే రూ. లక్ష వచ్చేది. ప్రస్తుతం రూ. లక్ష పెట్టుబడి పెడితే బాగా పండితే రూ. లక్షన్నర కూడా రావడంలేదు

రెట్టింపు ధరలతో అవస్థలు

ముండ్లా దానియేలు, రైతు, గుర్రపుశాల



వ్యవసాయ రంగానికి సంబధించిన అన్ని రకాల వస్తువుల ధరలు జిఎస్‌టి ప్రభావంతో పెరిగాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఎరువులు, పురుగు మందుల షాపుల యజమానులు ధరను పెంచి విక్రయిస్తున్నారు. దీంతో వ్యవసాయ రంగమే భారంగా మారింది.

జిఎస్‌టి నుంచి మినహాయించాలి

రువ్వల శ్రీను, రైతు, యర్రగొండపాలెం



రైతాంగానికి ఏటికేడు ధరలు వెంటాడు తున్నాయి. పన్నుల రూపంలో పురుగు మందులు, యంత్ర పరికరాలపై ప్రభుత్వం ఇష్టాన ఉసారంగా ధరలు పెంచుతుంది. దీంతో వ్యవసాయం భారంగా మారుతోంది. రైతు బాగుండాలంటే వ్యవసాయ రంగాన్ని జిఎస్‌టి నుంచి మినహాయించాలి.



ఆకాశంలో ఇంద్ర ధనస్సు

కనువిందుగా 'ఇంద్రధనస్సు'

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలో ఇంద్రధనస్సు కనువిందు చేసింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ విడతల వారీగా వర్షం కురిసింది. సాయంత్రం 4:30 గంటల ప్రాంతంలో వాతావరణం పొడిగా మారింది. అదే సమయంలో ఆకాశంలో అర్ధ చంద్రాకారంతో రంగు రంగుల ఇంద్రధనస్సు ఏర్పడింది. సుమారు 20 నిముషాల పాటు ఈ ఇంద్రధనస్సు చూపరులకు కనువిందు చేసింది.




బహుమతులు అందుకున్న విజేతలు

బహుమతులు అందజేత

ప్రజాశక్తి-మార్కాపురం

గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆవోపా ఆధ్వర్యంలో పెద్దారవీడు, మార్కాపురం, తర్లుపాడు మండలాల్లోని 6 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆవోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచపూడి సుబ్బారావు, కార్యదర్శి గుడిపాటి వెంకటసుబ్రమణ్యం చేతుల మీదుగా ఆదివారం బహుమతులు అందజేశారు. సీనియర్ విభాగంలో మొదటి, ద్వితీయ బహుమతులను చంద్రిక, హైమవతి సాధించారు. తృతీయ బహుమతిని ఎస్.కె.అఫ్రాపునిషా కైవసం చేసుకుంది. జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతిని ఎం వేదిస్వరి, ద్వితీయ బహుమతిని కెవి. రాజ్యలక్ష్మి, తృతీయ బహుమతిని ఎస్‌కె. సమీరా సాధించారు. ఈ కార్యక్రమంలో రామశేఖర్, కోటి మోహన్, సుబ్బారావు, నాగేశ్వరావు, ఆదినారాయణ శెట్టి, సుబ్బారావు. శ్రీనివాసులు, రామకష్ణ, మధుసూదన్ రావు, కేశవరావు, రామ సుబ్బారావు పాల్గొన్నారు.



ఆషాతో అసోసియేషన్ సభ్యులు

టైలర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా ఆషా

ప్రజాశక్తి - చీరాల

శ్రీకోటి మల్లికార్జున స్వామి టైలర్స్ వర్కర్స్ ఫెడరేషన్ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా ఎస్‌కె.ఆషా ఎన్నికయ్యారు. స్థానిక బెస్తపాలెంలోని ఆనంద నిలయంలో ఆదివారం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆషాను జిల్లా కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ టైలర్స్ సమస్యల పరిష్కారానికి, అసోసియేషన్ అభివద్ధికి కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరరావు, ప్రచార కన్వీనర్ మాధవరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు బాషా, టౌన్ ప్రసిడెంట్ ఎస్‌కె. నసీబా తదితరులు పాల్గొన్నారు.

బెండ రైతులకు దళారుల దగా

• రైతుకు రూ.20 గిడితే దళారీకి రూ.40 ఆదాయం

ప్రజాశ క్తి - పంగులూరు

ఆరుగాలం కష్టపడి పండించిన బెండ రైతుకు కేజీకి రూ.20 వస్తుండగా వినియోగ దారుపని దగ్గరికి వెళ్లేసరికి అది రూ.60 పలుకుతుంది. ఎలాంటి కష్టం చేయకుండా మార్కెట్లో కుర్చీ మీద కూర్చొని దళారీగా పని చేసే వ్యక్తికి కేజీకి రూ.40మిగులుతుంది. మార్కెట్ మాయాజాలంలో బెండ రైతులు విల విల్లాడుతున్నారు. వినియోగదారుడు కూడా కూరగాయలు కొనలేక సతమతం అవుతున్నాడు. మండలంలో 300 ఎకరాల్లో బెండ తోటలు సాగు చేశారు. వేసవిలో సాగు చేసిన బెండకు గిట్టుబాటు ధర లేక బెండ రైతులు నష్టపోయారు. కనీసం ఇప్పుడైనా గిట్టుబాటు ధర వస్తుందనే ఆశతో ఈఏడాది ఎక్కువగా సాగు చేశారు. వర్షాల కారణంగా బెండ పైరుకు చీడపీడలు చుట్టుముట్టాయి. అయినప్పటికీ వాటిని తట్టుకొని నిలబడేందుకు రైతులు పురుగు మందులకు అదనంగా పెట్టుబడి పెట్టారు. ఎకరాకు రూ.40వేలలకు పైగా పెట్టుబడులు పెట్టి సాగు చేశారు. ఇప్పుడు కోతల సీజన్ వచ్చింది. రోజు మార్చి రోజు కోత కోయాలని, ఒక్కరోజు పోయకపోతే కాయలు ముదిరిపోయే అవకాశం ఉందని రైతులు చెప్పారు. కాయలు కోసి మార్కెట్‌కు తీసుకువెళ్తే అక్కడ దళారీలు ఇష్టం



కొండమూరులో రైతులు సాగు చేసిన బెండతోట

వచ్చినట్లు అడుగుతారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన కాయలకు మాత్రమే అక్కడ గిరాకీ ఉంటుందని చెబుతున్నారు. నాణ్యతలేని కాయలను మరీ తక్కువకు అడుగుతారని అంటున్నారు. ప్రస్తుతం రైతు వద్ద కిలో రూ.20 లెక్కన ధర పలుకుతుంది. రైతు పెట్టిన పెట్టుబడికి వచ్చే ఆదాయానికి పొంతన లేకుండా ఉందని, పెట్టుబడులకు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వద్ద రూ.20కి కొన్న కిలో బెండ కాయలు వినియోగ దారునికి మార్కెట్లో కిలో రూ.60 లెక్కన అమ్ముతున్నారు. మధ్యలో దళారీలు కిలోకు రూ.40 పొందుతున్నారని రైతులు చెప్పారు. మార్కెట్లో దళారీల కారణంగా అన్ని రకాల కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, రైతుకు మాత్రం గిట్టుబాటు కావట్లేదని చెప్పారు. ఆటో బాడుగలు ఎక్కువ కావటం, కూలీల రేటు,, గోతాల రేట్లు పెరగటం వలన రైతుపై అదనపు భారం పడుతుందని తెలిపారు.



ఓరుగంటి కోటిరెడ్డి, రైతు, కొండమూరు

ఇదే ధరలు ఉంటే నష్టపోవాల్సిందే

తాను ఒకటిన్నర ఎకరం బెండ సాగు చేశానని, వేసవిలో వేసిన బెండ నష్టాలు పాలవడంతో ఈ సారైనా లాభం వస్తుందన్న ఆశతో బెండ సాగు చేశానని చెప్పారు. ఈపాటికి ఎకరానికి రూ.40వేల చొప్పున ఎకరన్నరకు రూ.60వేలు పెట్టుబడి పెట్టానని అన్నారు. ప్రస్తుతం కొంత ఆశాజనకంగా రేటు ఉన్నప్పటికీ ఈ రేటు పూర్తిగా ఉండదని చెప్పారు. మార్కెట్లో దళారీలదే పైచేయని చెప్పారు. ఇదే విధమైన రేటు కొనసాగితే రైతు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు.

మినుము పైరు దెబ్బతినడంతో రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కొల్లూరు

వరదల వల్ల కంద, పసుపు, అరటి, కూరగాయ పైర్లు నష్టపోయిన లంక గ్రామాల రైతులు ఆ పొలాల్లో రెండో పంట కింద ఎక్కువ శాతం మినుము సాగు చేస్తున్నారు. గత ఐదు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మినుము పైరు కూడా తెల్లాకు రావడం, నీటి శాతం ఎక్కువై పొలాలు తండిసిపోవడం, తెగుళ్లు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈపాటికే కంద, పసుపు, అరటి పైర్లకు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి వరద వల్ల నష్టపోయిన రైతులు మినుము పంట వల్లన కొంత ఉపశమనం కలుగుతుందని అనుకున్నారు. ఈ వర్షాలతో మినుము పైరు కూడా చేతికి అందేటట్లు లేదని రైతులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు తగ్గితే గాని పైర్లు దక్కవని రైతులు చెబుతున్నారు. ఇదే విధంగా ఉంటే రైతులు పూర్తిగా అప్పులపాలై ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు. కౌలు రైతులైతే మరీ దారుణమైన పరిస్థితిలో ఉన్నారు. ఒక ఎకరాకు కౌలు రూ.40వేలు, దానిలో కంద, పసుపు వంటి పంటల సాగుకు రూ.లక్ష ఖర్చయ్యింది. ఒక ఎకరంలో పంట



వర్షాలకు దెబ్బతిన్న మినుము పంట

సాగుకు రూ.1.40లక్షలు ఖర్చుపెట్టారు. పంట మొత్తం నీటిపాలై నష్టపోయిన కౌలు రైతులు పొలాల యజమానులకు కౌలు చెల్లించలేక, దెబ్బతిన్న పొలాల్లో రెండో పంట వేసి పండించే స్తోమత లేక ఆందోళనలో ఉన్నారు. దీనికి తోడు కొంత మంది కౌలు రైతులకు ప్రభుత్వం నుండి పంట నష్టపరిహారం అందలేదు. దీంతో కౌలు రైతులు పెట్టిన పెట్టుబడి అప్పులు తీర్చలేక, జీవనం సాగించలేక దిక్కుతోచని స్థితిలో కాలం గడుపుతున్నారు.

అంగన్‌వాడీలు రెండు యాప్‌ల్లో పనిచేయాలి

ప్రజాశక్తి - వేమూరు

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన బాల సంజీవిని పోషక ట్రాకర్ యాపులు రెండు సమానంగా పనిచేసే విధంగా కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలని సిడిపిఓ జి విజయలక్ష్మి సూచించారు. అమర్తలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రాజెక్టు సమావేశం ఆదివారం నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలోని అమృతలూరు, చుండూరు, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల అంగన్‌వాడి కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తల పోషణ ట్రాకర్ యాప్‌తో పిల్లలకు ఆరు నెలల నుండి మూడేళ్లలోపు, మూడు నుండి ఆరేళ్ల పిల్లలకు ఈకెవైసీ చేయటం, మొబైల్ వెరిఫికేషన్ చేయడం వంటివి జరుగుతాయని అన్నారు. బాల సంజీవిని యాప్, పోషక ట్రాకర్ యాప్ రెండు అనుబంధ పోషకాహారం తీసుకునే లబ్ధిదారులకు ఒకే రకంగా ఉండాలని అన్నారు. రెండు



అంగన్‌వాడి ప్రాజెక్టు సమావేశంలో సిడిపిఒ విజయలక్ష్మి

యాపుల్లో పనిచేసే విధానాన్ని కార్యకర్తలకు వివరించారు. అంగన్‌వాడి కేంద్రాల్లో ఉండే 11రకాల రిజిస్టర్ల గురించి వివరించారు. పిల్లల బరువు, ప్రి స్కూల్ పిల్లలకు 9గంటల నుండి నాలుగు గంటల వరకు ఆట, పాటలతో కూడిన విద్య, రంగులు వేయటం, కథలు చెప్పే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎసిడిపిఒ విజయ రాణి, సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగార్జున ప్రమాణ స్వీకారానికి తరలి రావాలి

ప్రజాశక్తి - వేమూరు

వైసిపి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని వైసిపి ఇన్చార్జి వరికోటి అశోక్ బాబు కోరారు. బాపట్ల పట్టణంలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపం నందు సోమవారం ఉదయం 10 గంటలకు బాధ్యతల స్వీకారం జరగనుందని తెలిపారు. జడ్పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, పంచాయతీ సర్పంచులు, వైసిపిలో వివిధ హోదాల్లోని నాయకులు పాల్గొనాలని కోరారు.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి - రేపల్లె

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో లేకుంటే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు హెచ్చరించారు. స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. చెడు నడత కలిగిన రౌడీ షీటర్లపై పోలీసు నిఘా ఉంటుందని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. రౌడీ షీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత స్టేషన్లలో సంతకాలు చేస్తూ ఉండాలని అన్నారు. బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సురేష్ బాబు, పట్టణ సీఐ ఏ మల్లికార్జునరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.



ఉయ్యాల ఊగుతున్న చిన్నారులు

సంప్రదాయాలను మరువకూడదు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అంతరించిపోతున్న తెలుగు సంప్రదాయాలను మరువకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలుగు యువత నాయకులు కోరారు. మండలంలోని తాటివారిపాలెంలో తెలుగు యువత అధ్యక్షులు కుందుర్తి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అట్లతద్ది వేడుకలు నిర్వహించారు. గ్రామంలో యువత నేతృత్వంలో భారీ ఉయ్యాల ఏర్పాటు చేసి చిన్నారులకు పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో వజ్జా వీరాంజనేయులు, తెలుగు యువత నాయకులు వెంకట సుబ్బ రావు, కొడవల వెంకటరావు, కొడవండ్ల స్వామి, శోభన్ బాబు, సిద్ధయ్య, లక్ష్మయ్య, సుబ్బారావు, ప్రకాష్, గోపి, యేసు బాబు, నాగేశ్వరావు, వెంకటస్వామి, అరవింద్, పూర్ణయ్య పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

ఒంగోలు నగరం త్రోవగుంట జెడ్‌పి హైస్కూలులో అండర్ 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ పోటీలకు జిల్లా స్థాయి బాల, బాలికల ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల నుంచి 200మంది క్రీడాకారులు హాజరయ్యారు. 12మంది బాలురు, 12మంది బాలికలను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. వీరిలో పందిళ్ళపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల నుండి వాయిల వెంకయ్య, వాయిల నందూరావు అనే ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్లు కర్ణ నాగేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21నుంచి 23వరకు సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో జరిగే అంతర జిల్లా వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మెడబలిమి శేఖరరావు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఛైర్మన్ చెరుకూరి రాంబాబు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు క్రీడాకారులకు అభినందించారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సెమినార్ నిర్వాహకులు

22న శంకరన్ స్మారక సెమినార్

ప్రజాశక్తి - బాపట్ల

సీనియర్ ఐఎఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ జయంతి సందర్భంగా ఈనెల 22న శంకరన్ స్మారక సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ ట్రస్ట్, పౌర సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కె విజయ్ కుమార్, బి శరత్ బోస్ తెలిపారు. పట్టణంలోని హోటల్ గౌతంలో 'ప్రజాస్వామ్యం – సుపరిపాలన' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఆర్.శంకరన్‌తో కలిసి పనిచేసిన, ఆయనతో అనుబంధముండి ఆయన అడుగుజాడల్లో సమాజ సేవలు చేస్తున్న విశ్రాంత ఐఎఎస్ అధికారులు మాట్లాడతారని తెలిపారు. సుపరిపాలన ఏవిధంగా ఉండాలనే ఆలోచనలను వివరిస్తారని తెలిపారు. కలెక్టర్ జె వెంకట మురళి ప్రారంభించే సెమినార్లో హెచ్‌సియు మాజీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కె హరగోపాల్, భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఎస్ చక్రవర్తి, ఎన్ రమేష్ కుమార్, ఆర్ సుబ్రమణ్యం, డి చక్రపాణి పాల్గొంటారని తెలిపారు. సెమినార్ అనంతరం జరిగే చర్చా గోష్ఠిలో ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా సదస్సు కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో కె విజయకుమార్, బి శరత్ బోస్, కరణం రవీంద్ర, శంకరన్ ట్రస్ట్ నాయకులు పిసి సాయిబాబు, జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టిడిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి - వేమూరు


ఈనెల 21న సోమవారం మధ్యాహ్నం 3గంటలకు స్థానిక లక్ష్మీ పద్మావతి కల్యాణ మండపంలో తెలుగుదేశం నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని టిడిపి మండల అధ్యక్షులు, మాజీ ఎఎంసి చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు తెలిపారు. సమావేశానికి శాసన సభ్యులు నక్కా ఆనందబాబు హాజరవుతారని తెలిపారు. రానున్న శాసన మండలి ఎన్నికలు, తెలుగుదేశం సభ్యత నమోదు గురించి వివరిస్థారాని చెప్పారు. తెలుగుదేశం వివిధ స్థాయిల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

పేద మహిళకు అధికారుల బెదిరింపులు

- పోరంబోకు భూమిలో నివాసం ఉంటున్న మహిళ
- ఖాళీ చేయించి మరో వ్యక్తికి కట్టబెట్టే యత్నం

ప్రజాశక్తి - పంగులూరు

తాతల కాలం నుండి పోరంబోకు భూమిలో నివసిస్తున్న తనను ఖాళీ చేయించి పక్కనే పట్టా భూమి ఉన్న వ్యక్తికి ఆ భూమిని కట్టబెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, తనని భయభ్రాంతులకు గురిచేసి ఇబ్బంది పెడుతున్నారని మండలంలోని బైట మంజులూరు గ్రామానికి చెందిన పేద మహిళ రత్నాకరం బుల్లచ్చమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తన తాతల కాలం నుండి గ్రామంలోని డొంక పోరంబోకు సర్వేనెంబర్ 108/3లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. ఆ భూమి పక్కనే పట్టా భూమి ఉందని, ఆ భూమికి చెందిన వ్యక్తికి ఈ పోరంబోకు భూమిని కట్టబెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆమె విలపించారు. తనకు ఆ భూమి తప్ప నివాసం ఉండేందుకు మరేమీ లేదని చెప్పారు. గ్రామంలోని సర్వే నెంబరు 113/5, 109/3, 108 /3, 80/1, 79/1, 77/1, 76/1 లలో సుమారు ఆరెకరాల డొంక పోరంబోకు భూమి ఉందని తెలిపారు. ఆ భూమి మొత్తం ఆక్రమణలకు గురైందని, కొంత మంది ఇల్లు నిర్మించుకోగా, మరి కొంతమంది పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఆ భూమిలో సర్వేనెంబర్ 108/3 లో 17సెంట్ల భూమిలో తన తాతల కాలం నుండి ఇల్లు నిర్మించుకొని, వాడుకుంటున్నామని తెలిపారు. తాను ప్రస్తుతం రేకులతో నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నానని తెలిపారు. ఆ భూమి పక్కనే సరి కొండ వరమ్మకు 97సెంట్లు పట్టాభి ఉందని, ఆ భూమిని గ్రామానికి చెందిన తోకచిచ్చు వెంకటేశ్వరరాజు మేనకోడలు రాజ్యలక్ష్మి పేరుతో కొన్నారని తెలిపారు. ఆ భూమిలో తాను నివసిస్తున్న భూమిని కలుపు కోవాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గత నాలుగైదేళ్ల నుండి రెవెన్యూ, పోలీసు అధికారుల ద్వారా తనను భయపెడుతున్నారని తెలిపారు. ప్రస్తుత తహశీల్దారు తనను ఆఫీసుకు పిలిపించి బెదిరిస్తున్నాడని, ఆ భూమిని ఖాళీ చేసి పక్కనున్న భూమి యజమానికి అప్పగించాలని చెబుతున్నాడని అన్నారు. పేద మహిళనని కూడా చూడకుండా తనను మాట్లాడాడని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పనిచేసిన తహశీల్దారు కూడా తనను బెదిరించారని చెప్పారు. రేణింగవరం పోలీసులు ఆదివారం వచ్చి పరిశీలించి పోయారని తెలిపారు. పక్కనున్న భూమి యజమానికి దారి ఎంత కావాలన్నా తాను వదిలిపెడతానని, కానీ తాను నివసించేందుకు ఎలాంటి స్థలం లేక పోవటం వలన తాను ఆ స్థానంలోనే నివసిస్తానని తెలిపారు. అధికారులు ఆ డొంక పోరంబోకు భూమిని ఆక్రమించిన మిగతా వారిని ఎవరిని ఏమి చేయకుండా తనను మాత్రమే స్థలం ఖాళీ చేయమని బెదిరిస్తున్నారని తెలిపారు.



బుల్లచ్చమ్మ ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ఆమె పట్టా భూమిలోకి వచ్చింది

బుల్లచ్చమ్మ నివాసం వివాదంపై తహశీల్దారు సింగారావును 'ప్రజాశక్తి' వివరణ కోరగా తాను సర్వేయర్‌ను ఆ స్థలం వద్దకు పంపి కొలిపించాలని తెలిపారు. బుల్లచ్చమ్మ ఉంటున్న స్థలం పట్టా భూమిలోకి వచ్చిందని తెలిపారు. అందువలన ఆ భూమిని ఖాళీ చేయమని ఆమెకు చెప్పానని అన్నారు. డొంక పోరంబోకు భూమిలో నివాసం ఉంటం నేరమని అన్నారు. అందువలన ఆమెను కాళీ చేయమన్నామని తెలిపారు.



రామిరెడ్డిపాలెం పాఠశాల్లో పెచ్చులూడిన స్లాబ్

శిధిలావస్థలో పాఠశాల భవనం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని రామిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల వర్షం వస్తే జలమయంగా మారుతుంది. పాఠశాల భవనం స్లాబు శిథిలావస్థకు చేరింది. తరగతి గదిలో కూర్చుంటే ఎప్పులు పెచ్చులూడి పడతాయో తెలియని ప్రమాదకర పరిస్థితి ఏర్పడిందని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్లాబ్ పెచ్చులూడి ఇనుప చువ్వలు వేలాడుతున్నాయి. ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రధానోపాధ్యాయుడు పుచ్చకాయల కోటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల్లో 30మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల్లోని త్రాగునీటి బోరింగు శిథిలావస్థకు చేరింది. నాలుగు నెలలు దాటిన రిపేరు చేసే నాథుడే లేరని అన్నారు. దీంతో పాఠశాల్లోని విద్యార్థులు త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకున్న నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికా రులు స్పందించి కొత్త భవనాన్ని మంజూరు చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

తాను పోలీసు ఉద్యోగం చేస్తున్నాంటూ మాయమాటలు చెప్పి ఓయువతిని వివాహం కాకుండానే ఒక బిడ్డకు తల్లిని చేసిన వ్యక్తిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. గుంటూరు జిల్లా బాపట్ల మండలం పెదనందిపాడు గ్రామానికి చెందిన షేక్ రసూల్ భాష తాను పోలుసు ఉద్యోగం చేస్తున్నానని చెప్పి నాగులుప్పలపాడు మండలం కొత్తకోట గ్రామానికి చెందిన ఓ యువతితో పరిచయం చేసుకున్నాడు. ఆ పరిచయం శారీరకంగా ముడిబడి ఒకబిడ్డకు జన్మనిచ్చే వరకు చేరింది. తనను వివాహం చేసుకుంటానని మోసం చేసాడని బాదితురాలు ఇచ్చిన ఆపిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి శ్రీకాంత్ తెలిపారు.

పోలీసు అమరవీరుల దినోత్సవం

ప్రజాశక్తి - అద్దంకి



సిఐ పి కృష్ణయ్య

భారత్, టిబెట్ సరిహద్దుల్లోని లడక్‌లో గల ఆక్సాయి చిన్ వద్ద 65ఏళ్ల క్రితం భారత్‌కు చెందిన కేంద్ర రిజర్వు పోలీసులు (సిఆర్‌పిఎఫ్) కూంబింగ్ విపరీతమైన చలిలో విధులు నిర్వర్తిస్తుండగా భారత సరిహద్దులోకి భారీ సంఖ్యలో చైనా సైనికులు చొచ్చుకువచ్చి కాల్పులు మొదలెట్టారు. ఆకస్మికంగా దాడికి దిగిన చైనా బలగాలను చూసి అప్రమత్తమైన మన సీఆర్‌పిఎఫ్ బృందం వారికి ఎదురు తిరిగి ధీటుగా సమాధానమిచ్చింది. డీఎస్పీ కరమ్‌సింగ్ ఆధ్వర్యంలోని సీఆర్‌పిఎఫ్ బృందం చైనా సైనికులను మట్టుపెట్టే క్రమంలో 10మంది వీర మరణం పొందారు. చివరి శ్వాస వరకు పోరాడి దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. ఇది జరిగిన కొన్ని నెలల తర్వాత అన్ని రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు సమావేశమై అక్టోబరు 21న ప్రతిఏటా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించాలని తీర్మానించారని, అప్పటి నుండి పోలీసు అమర వీరుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సిఐ పి కృష్ణయ్య తెలిపారు. ప్రపంచమంతా నిద్రలో ఉంటే వారు మాత్రం మేల్కొని, మన కోసం కాపలా కాస్తుంటారని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగానికి వెనుకాడరని అన్నారు. గంభీరం, తెగువ, భరోసాకు మారుపేరైన పోలీసులు 24 గంటలు ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడుతూ సేవలందిస్తుంటారని అన్నారు. అల్లర్లు, కల్లోలాలు, నేరాలు, సహాయక కార్యక్రమాలు వంటి అనేక సందర్భాల్లో పోలీసులు ఆ పరిస్థితిని సద్దుమణిగేలా చేస్తారని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో కీలకపాత్ర పోషిస్తారని అన్నారు. అందుకే సమాజ శ్రేయస్సు కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీస్ అమర వీరుల త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ వారి కుటుంబాలకు ధైర్యం చెప్పడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం'నిర్వహిస్తున్నారని తెలిపారు.

విలువైన సాహిత్యంతో మంచి సమాజం

ప్రజాశక్తి - బాపట్ల



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న రచయితలు

విలువైన సాహిత్యం సమాజాన్ని ముందుకు నడిపిస్తుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విశ్రాంతి అసోసియేట్ డీన్ దర్శి విష్ణు శంకరరావు అన్నారు. బావపురి సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో సాహితీ భారతీ ఆధ్వర్యంలో మర్రి మాలాద్రిరావు రచించిన తొలి పంట కవిత సంపుటి ఆవిష్కరణ సభలో ఆయన అధ్యక్షోపన్యాసం చేశారు. రచయిత మాలాద్రిరావు సాహిత్య సేవలను ప్రస్తుతించారు. విశ్రాంత అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కట్టా వినయ్ కుమార్ మాట్లాడుతూ ఆధునిక సాహిత్యం విలువలకు భాష ఉండాల్సిన గౌరవాన్ని వివరించారు. చరిత్ర పరిశోధకులు, ఎన్టీఆర్ అవార్డు గ్రహీత, బాపట్ల, రేపల్లె రంగస్థల పుస్తక రచయిత మన్నే శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మిక, కర్షక, కష్టజీవుల శ్రమను రచయిత మాలాద్రిరావు తన తొలి పంట కవితా సంపుటిలో వివరించారని పేర్కొన్నారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు మాట్లాడుతూ రచయిత మాలాద్రిరావు తన కవిత సంపుటిలో ప్రస్తుత సమాజంలో జరిగే అంశాలను పొందు పరిచారని అన్నారు. చీరాలకు చెందిన గొల్లపూడి సీతారాం తొలి పంట పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలోసాహితీ భారతీ అధ్యక్షులు రావూరి నరసింహవర్మ, సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు కె శ్రీ హరిరావు, విశ్రాంత అధ్యాపకులు జివి సుబ్రహ్మణ్యం, కామరాజు కాళిదాసు, ఎంఎల్‌వి ప్రసాదు. బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, నరసరాజు, వై నాగేశ్వరరావు, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు పి సుబ్బారావు, బందాబాబు, కె భద్రయ్య, పి విజయ సారథి, మస్తాన్‌వలి పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జనసేన ఇన్‌ఛార్జి శివన్నారాయణ

మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - బాపట్ల

రానున్న రోజుల్లో ప్రజలు కాలుష్యం బారిన పడకుండా పర్యావరణ పరిరక్షణకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శ్రీమన్నారాయణ అన్నారు. పట్టణంలోని త్రవ్వ కాలువ డొంక భూమికి ఇరువైపులా మునిసిపల్ కార్యాలయం వద్ద నుండి అలపర్తి ప్లాట్ల వరకు వనమహోత్సవంలో భాగంగా ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఆగస్టు 30 నుండి నవంబర్ 30వరకు వనమహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాల్వకు ఇరువైపులా 530మొక్కలు నాటారు. జనసేన నాయకులు కెఆర్‌కె నాయుడు, గౌతమ్ నాయుడు, కొక్కిరాల రాజేంద్ర, చల్లా శ్రీనివాసరావు, కె రమణ, కె నవిత, ఆర్‌ఎ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బి విజయ్‌కుమార్

క్రికెట్ గ్రౌండ్ పరిశీలన

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక ఋగ్వేద క్రికెట్ అరీనా మైదానాన్ని ఆంధ్ర క్రికెట్ గ్రౌండ్స్ డెవలప్మెంట్ ప్రతినిధులు ఆదివారం ఎసిఎ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్చార్జి బి విజయ్ కుమార్ క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాట్లాడారు. రంజీ మ్యాచి స్టేట్, జిల్లా మ్యాచ్‌లు జరుపుకొవటానికి అన్ని విధాల ఉపయోగపడుతుందని అన్నారు. ఈ మైదానం యజమాని ఇంటూరు వంశీ పర్చూరు వచ్చి రుగ్వేద క్రికెట్ అరీనా గ్రౌండును పరిశీలించాలన్న ఆహ్వానం మేరకు క్రికెట్ గ్రౌండును పరిశీలించినట్లు తెలిపారు. వీరి వెంట క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ మోహనదాస్, జాయింట్ సెక్రెటరీ కొల్లా మధు, జిల్లా ప్రతినిధులు సాయి కృష్ణ, టిడిపి నాయకులు సంశుద్దీన్, ఎం శేఖర్‌బాబు, ఎవి కృష్ణ, ఎం హరిప్రసాద్, చెంపయ్య, పిసిసి ప్రతినిధులు టి శ్రీనివాసరావు, ఆర్ రవికుమార్, కె రమేష్, ఎ సురేష్, డి రమేష్, తేజ, జవహర్, చెరుకూరి శ్రీధర్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - బాపట్ల

గిరిజన, సాంఘీక సంక్షేమ శాఖల ఆధ్వర్యం లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత డిఎస్‌సి శిక్షణకు ఆన్లైన్ దరఖాస్తులు ఈనెల 21లోపు పంపుకోవాలని సాంఘిక సంక్షేమ సాధికారత జిల్లా అధికారి జె రాజదెబోర తెలిపారు. ఉచిత శిక్షణకు https://jnanabhumi. ap.gov.in ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50లక్షలలోపు ఉండాలని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు ఏదైన గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీతో పాటు బిఈడి అర్హత ఉండాలని తెలిపారు. శిక్షణ ఎంపికకు స్క్రీనింగ్ టెస్టులో పొందిన మార్కుల్లో 85శాతం మార్కులు టెట్‌లో పొందిన మార్కుల్లో 15శాతం వెయిటేజి తీసుకోనున్నట్లు తెలిపారు. ఈనెల 22నుండి 25వరకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, 27న ఆన్లైన్, ఆఫ్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారని, 28న మెరిట్ లిస్ట్ ప్రకటిస్తారని, జిల్లాల వారిగా ఎంపికైన అభ్యర్థుల జాబితా 30న ప్రకటిస్తారని అన్నారు. నవంబర్ 6న కోచింగ్ మొదలవుతుందని తెలిపారు.

రైతుల కష్టం..మట్టిపాలు..


గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

గుర్రపుడెక్కను తొలగించాలి : మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తన స్వగ్రామమైన తుర్పునాయుడుపాలెం గ్రామంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని జాతీయ రహదారి హైవే బ్రిడ్జి, గ్రామంలోని వంతెనలు పరిశీలించారు. వంతెనలు, బ్రిడ్జి క్రింద పేరుకు పోయిన గుర్రపు డెక్క తొలగించి , వరద నీరు నిలువ కుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పల్లెసీమలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి స్వామి సూచించారు.

- వర్షానికి నేలరాలిన పత్తి కాయలు

అల్ప పీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు రైతుల కష్టం మట్టిపాలైంది. పత్తి రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకు పోయారు. నష్టపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలో ఈ ఏడాది వేసవి ముందస్తు అదునులో సుమారు 3,500 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. తోటలను కంటికి రెప్పల్లా కాపాడుకున్నారు. సేద్యం, విత్తనాలు, కూలీలు, పురుగు మందులు, బలం ఎరువులు ఇలా ఒక్కో ఎకరానికి రూ. 40 నుంచి రూ. 50 వేలు వరకూ పెట్టుబడి రూపంలో ఖర్చు చేశారు. పూత, పిందె వచ్చి తోటలు కళకళలాడుతున్నాయి. పత్తి కాపుకు వచచ్చింది. పత్తి తీసేందుకు రైతులు సమయత్తమయ్యారు. ఒక్కో ఎకరాకు పత్తి తీస్తే పది క్వింటాళ మేరకు దిగుబడి వస్తుందని ఆశ పడ్డారు. పెటు ట్టబడులు తీరుతాయని, పైరుపై నమ్మకం పెట్టుకున్నారు.

అల్ప పీడన ప్రభావంతో..

అల్ప పీడన ప్రభావంతో మూడు రోజులు పాటు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో కోతకు సిద్ధంగా ఉన్న పత్తి కాయలు రాలి నేలపాలు అయ్యాయి. పూత, పిందెలు సైతం రాలిపోయాయి. పొలంలో నీరు


వర్షానికి దెబ్బతిన్న పత్తి పంట

నిలవడంతో రాలిన పత్తి కనీస ఎరడానికి కూడా పనికి రాకుండా నీళ్లలో నాని పోయింది. ఫలితంగా రైతులకు పెట్టుబడి కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదు.

ప్రభుత్వం ఆదుకోవాలి

అల్ప పీడన ప్రభావంతో నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలని నీలబోయిన బాదరయ్య, పాశం కోటయ్య, పాశం పాపయ్య, వెంకటేశ్వర్లు, మంత్రు నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గతంలో తుపాను ప్రభావంతో నష్టపోయిన పంటలను రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా పొలాల్లో పర్యటించి, తోటలను పరిశీలించి నష్టం అంచనాలను తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారని గుర్తు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ కూడా నష్టపరిహారం రాలేదని వారు తెలిపారు.

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితిలేదు

మూడావత్ రెడ్డి నాయక్, రైతు, పిల్లికుంట తాండా



ఈ ఏడాది ఐదు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. పెట్టుబడి రూపంలో రూ. రెండు లక్షలు ఖర్చు చేశాను. కాపు కోద్దామనుకునే సమయంలో వర్షం కారణంగా పత్తి పంటంతా నేలపాలైంది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

రైతులను ఆదుకోవాలి

రామావత్ బాలు నాయక్, రైతు, మిల్లంపల్లి

ఆరుగాలం కష్టించి పత్తి పైరును సాగు చేశాను. ఐదు



ఎకరాల సాగుకు గాను రూ. రెండున్నర లక్షలు పెట్టుబడి పెట్టాను. పత్తి కాయలు వర్షానికి రాలి పోయాయి. నీరు నిల్వడంతో తోట ఉరకెత్తింది. పెట్టుబడి కూడా వస్తుందని నమ్మకం లేదు. పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.


నిరసన తెలుపుతున్న నాయకులు

గుంతలు పూడ్చాలని నిరసన

ప్రజాశక్తి -ఒంగోలు సబర్బన్

నగరం లోని 50వ డివిజన్ జయ ప్రకాష్ కాలనీ ఎక్సటెషనులో రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జయప్రకాష్‌కాలనీ శాఖ ఆధ్వర్యంలో కాలనీ ప్రజలు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి జి.రమేష్ మాట్లాడుతూ వర్షాల వలన రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రజలు నడవడానికి కూడా వీలు లేకుండా ఉందని తెలిపారు. అక్కడ ప్రజలు కూలి పనులు చేసుకుని జీవించేవారు అని వివరించారు. రోడ్డుపై సుమారు ఏడు గుంతలు ఏర్పడినట్లు తెలిపారు. అందులో రెండు గుంటల పెద్దవిగా ఉన్నట్లు తెలిపారు. మిగిలినవి చిన్నవని తెలిపారు. కార్పొరేషన్ అధికారులు మట్టి తోలిస్తే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. జయప్రకాష్ కాలనీలో రోడ్డు నిర్మించాలని అనేకసార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులను కోరాని ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణం రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు బాబు, సురేఖ,నవమ్మ,మరియమ్మ,మోహన్ రావు, లీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్థానిక ముస్లిం షాదీఖానాలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి, నంద్యాల శాంతిరాం కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ఎంఇఒ పి.ఆంజనేయులు, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి నియోజవర్గ అధ్యక్షుడు డాక్టర్ షేక్ ఇస్మాయిల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి పట్టణ అధ్యక్షుడు ఖాసింవలి, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ కరీంబాషా, కార్యదర్శి షేక్ ఖలీల్, సహాయ కార్యదర్శి షేక్ కాసిం సాహెబ్, కోశాధికారి షేక్ బాషా, జనసేన పార్టీ నాయకుడు ఆకుల రమేష్, రియాజ్, సిపిఐ నాయకుడు చెన్నయ, బీసీపి నాయకుడువెంకటేశ్వర్లు, పిటిఎల్‌యు నాయకుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ధ్యేయం

- పండ్ల తోటల సాగుకు రాయితీలు
- హైబ్రిడ్ కూరగాయల పథకం అమలు
- 90 ఫారమ్ పాండ్స్ నిర్మాణం
- ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు యంత్రాలు
- జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్



ముఖాముఖి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉద్యాన రైతుల అభ్యున్నతే ధ్యేయంగా తాము పని చేస్తున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్ తెలిపారు. జిల్లా సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి పథకంలో పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులకు రాయితీలు ఇస్తున్నామన్నారు. హైబ్రీడ్ కూరగాయల పథకంలో లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. పండ్ల తోటలలో నీరు నిల్వ చేయటానికి 90 ఫారమ్ పాండ్స్ నిర్మిస్తున్నామన్నారు. ఉద్యాన యాంత్రీకరణ పథకంలో 50 శాతం రాయితీపై 354 యంత్రాలు రైతులకు అందజేస్తామన్నారు. ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న రాయితీల గురించి డిహెచ్ఒ ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటలల్లోనే.....

జిల్లాలోని ఉద్యాన రైతులకు అవసరమైన రాయితీలు అందించేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిర్ధేశించిన లక్ష్యాలను 100 శాతం సాధించేందుకు చర్యలు చేపడుతున్నాం.

పండ్ల తోటల రైతులకు రాయితీలు

జిల్లా సమగ్ర ఉద్యాన పంటల అభివద్ధి మిషన్ (ఎంఐడిహెచ్) 2024-25లో కొత్తగా పండ్ల తోటలు సాగు చేసే రైతులకు 40 శాతం రాయితీతో పండ్ల తోటల సాగుకు 402.00 హెక్టార్లల్లో రూ.83.82 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటి వరకు 194.46 హెక్టార్లల్లో లబ్ధిదారుల ఎంపిక చేశాం.75, 90 శాతం రాయితీపై రెండవ, మూడవ సంవత్సరం పండ్లతోటల నిర్వహణకు 613.93 హెక్టార్లకు రూ. 24.68 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. 550.60 హెక్టార్లల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశాం

హైబ్రీడ్ కూరగాయల విస్తరణ పథకం అమలు

హైబ్రీడ్ కూరగాయల విస్తరణ పథకంలో హెక్టారుకు రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయంతో 137 హెక్టార్లలో రూ.27.40 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటి వరకు 7.20 హెక్టార్లల్లో లబ్ధిదారులను ఎంపిక చేశాం. పూల తోటల సాగు పథకంలో హెక్టారుకు రూ.16 వేలు చొప్పున ఆర్థిక ఆర్థిక సాయంతో 260.00 హెక్టార్లలో రూ.41.60 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం 11.85 హెక్టార్లల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తి అయింది.

90 ఫారం పాండ్స్ నిర్మాణం

పండ్ల తోటలలో నీరు నిల్వ చేయటానికి 90 ఫారం పాండ్స్ (నీటి కుంటలు) నిర్మాణానికి రూ.75,000 చొప్పున రూ.32.25 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. 4 కమ్యూనిటీ ఫారం పాండ్ (నీటి కుంట) నిర్మాణానికి రూ.80 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటి వరకు 22 ఫారం పాండ్స్ నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇచ్చాం. రక్షిత వ్యవసాయ పథకంలో 50 శాతం రాయితీపై అధిక విలువ కలిగిన కూరగాయలు, పూల తోటల సంవత్సరం పొడవున సాగు చేయటానికి 3.90 హెక్టార్లలో రూ.1.41 కోట్లకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. దానిమ్మ తోటల్లో రక్షణ వలలకు 62.50 హెక్టార్లలో రూ.20.73 లక్షలకు కార్య ప్రణాళిక ఆమోదించబడినది. 2.40 హెక్టార్లలో లబ్దిదారులను గుర్తించాం.

మల్చింగ్ పథకంలో రైతులకు రాయితీలు

సమగ్ర నీటి వినియోగంతో పండ్లు, కూరగాయల తోటలు సాగు చేసే రైతులకు మల్చింగ్ పథకంలో 50 శాతం రాయితీపై 240 హెక్టార్లలో రూ.38.40 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటి వరకు 23.82 హెక్టార్లల్లో మల్చింగ్ పాటించిన లబ్దిదారులను గుర్తించాం. కోత అనంతరం పంట నిల్వ చేసుకోవటానికి 77 (ప్యాక్ హౌస్‌లు, శీతల గిడ్డంగులు, రైపనింగ్ చాంబర్స్, కోల్డ్ రూమ్స్, ప్రత్యామ్నాయ సాంకేతిక పద్దతులకు) రూ.10.69 కోట్లతో కార్య ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటి వరకూ 11 లబ్దిదారులకు పరిపాలన అనుమతి మంజూరు చేశాం. 40 శాతం రాయితీపై మార్కెటింగ్ మౌలిక సదుపాయాల ఏర్పాటులో రూ.1.20 కోట్లకు కార్య ప్రణా 8ళికను అమలు చేస్తున్నాం. ఇప్పటి వరకు ఇద్దరు లబ్ధిదారులకు పరిపాలన అనుమతి మంజూరు చేశాం

50 శాతం రాయితీపై యాంత్రీకరణ పథకం

ఉద్యాన యాంత్రీకరణ పథకంలో 50 శాతం రాయితీపై 354 (మిని ట్రాక్టర్లు, ఫ్లవర్ బిల్లర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు) రూ.69.00 లక్షలకు కార్య ప్రణాళిక ఆమోదించాం. సమీకత పోషక నిర్వహణ, సమీకత సస్యరక్షణలో 50 హెక్టార్లలో రూ.0.60 లక్షలకు కార్య ప్రణాళిక ఆమోదించాం.